www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 7 జులై 2023
5
వైఎస్ఆర్



వైవీయూ బిఎఫ్ఎలో ప్రవేశానికి గడువు పెంపు

కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం కళాశాలలో లలితకళా విభాగంలో నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ (బిఎఫ్ఎ) కోర్సులో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వైవీయూ లలితకళా విభాగం విభాగాధిపతి డాక్టర్ కె. మృత్యుంజయరావు ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సులో ప్రవేశానికి ఇంటర్మీడియట్‌లో ఏ గ్రూప్ లో అయినా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలలో డిజైనర్, ఆర్టిస్ట్‌గా కేంద్ర ప్రభుత్వ సంస్థలైన నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు, సైనిక స్కూల్‌లలో ఆర్ట్ టీచరుగా, సినీరంగంలో సెట్ డిజైనర్‌గా, ఇంటీరియర్, ఫ్యాషన్ డిజైనర్‌గా రాణించే ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందుకోవచ్చని తెలిపారు. ఈ కోర్సుల్లో పట్టభద్రులైన వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 12 లోపు ఒఎఎండిసి వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్, ఇతర సందేహాలకు 9492345419, 9010014304లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

గండికోటకు 'ఒబెరాయ్'తో కొత్త కళ



- సిఎం పర్యటనకు పనులు ముమ్మరం
- 50 ఎకరాలలో 120 విల్లాలు
- రూ.250 కోట్ల పెట్టుబడులు
- రోప్‌వే పూర్తితో పాటు అభివృద్ధి వరాలు కురిపించేనా ?

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఎపి సిఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సొంత జిల్లాలో ప్రసిద్ధి చెందిన పర్యాటక కేంద్రం గండికోటకు ఒబెరాయ్ హోటల్స్‌తో మరింతగా పర్యాటక కళ పెరగనుంది. ఈ పర్యాటక కేంద్రంలో ఆతిథ్య రంగంలో దేశంలోనే పేరెన్నిగన్న ఒబెరాయ్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ లిమిటెడ్ ఏకంగా రూ.250 కోట్లను పెట్టుబడిగా పెట్టనుంది. ఈ నిధులతో గండికోటలో 120 విల్లాలను ఆ సంస్థ నిర్మించనుందని ఇందుకోసం ఆ సంస్థకు అవసరమైన 50 ఎకరాలను ప్రభుత్వం 99 ఏళ్లపాటు లీజుకు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ మేరకు గండికోట పర్యాటక ప్రాంతంలో హోటల్స్ నిర్మించేందుకు అవసరమైన స్థలాలను పరిశీలించేందుకు ఇటీవలే ఒబెరాయ్ సిఇఒ అర్జున్‌సింగ్ తన ప్రతినిధి బృందంతో నాలుగు దఫాలుగా వచ్చి జిల్లా అధికారులతో కలిసి ఆయన గండికోట ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ పరిశీలనలో తమ ప్రాజెక్టు ఏర్పాటుకు అనుగుణంగా ఉన్న స్థలాన్ని అర్జున్‌సింగ్ గుర్తించగా, అదే ప్రాంతంలోని 50 ఎకరాలను ఒబెరాయ్ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం లీజుకు ఇచ్చింది. గండికోటను ప్రపంచ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతోనే ఈ లీజుకు అనుమతి ఇచ్చిందని తెలుస్తుంది. అందులో భాగంగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈ నెల 7,8,9 తేదీలలో జిల్లా పర్యటన ఉండటంతో గండికోటలో ఒబెరాయ్ హోటల్స్‌కు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. ఇప్పటికే జిల్లా స్థాయి అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. హెలికాప్టర్ దిగేందుకు హెలిప్యాడ్ ను, శంకుస్థాన చేసే ప్రాంతాన్ని పరిశీలించి అక్కడే సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లాలో ఉన్న గండికోట గ్రామం పెన్నా నది ప్రక్కన ఉన్న అద్భుతమైన లోయకు నిలయం. గండికోట లోయను కాన్యన్ అని కూడా పిలుస్తారు. ఈ సహజ నిర్మాణం తరచుగా యుఎస్‌ఎలోని అరిజోనాలోని గ్రాండ్ కాన్యన్‌తో పోలి ఉంటుంది. రెండింటినీ పోల్చడం సరైంది కానప్పటికీ, గండికోటకు ఒక చరిత్ర ఉంది. దాని స్వంత ప్రత్యేక లక్షణాలతో ప్రజాదరణను పొందుతోంది. హోటల్స్‌తోపాటు రోప్ వే పనులను వేగవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఆదివారాలు, సెలవులు, పండుగల ప్రత్యేక రోజులలో గండికోట పర్యటకులతో కిక్కిరిసి పోతుంది. అలాంటి పర్యాటక ప్రాంతంలో సరైన పార్కింగ్ కానీ, టాయిలెట్స్ కానీ, ఇతర మౌలిక వసతులు లేవనేది జగమెరిగిన సత్యం. ముఖ్యమంత్రి హోదాలో గండికోటకు జగన్ మోహన్ రెడ్డి రావడం తొలి సారి. ఈ అద్భుత కోటను చూసి మరిన్ని అభివృద్ధి పనులకు, గండికోట గ్రామ పంచాయితీ అభివృద్ధికి వరాలు కురిపించాలని స్థానికులు కోరుతున్నారు.


ముఖ్యమంత్రి సభకు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

సిఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ విజయ్‌రామరాజు, ఎస్‌పి అన్బురాజన్

ప్రజాశక్తి-కడప/వేంపల్లె/పులివెందుల టౌన్

ముఖ్యమంత్రి వైఎస్ .జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలో ఈ నెల 8, 9,10వ తేదీ వరకు మూడు రోజుల పర్యటన నేపథ్యంలో జరుగుతున్న ఏర్పాట్లను కలెక్టర్ విజయ్‌రామరాజు, ఎస్‌పి అన్బురాజన్ గురువారం పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాల్లో గురువారం వారు పర్యటించారు. కడప నగర పర్యటన నేపథ్యంలో ఆర్ట్స్ కళాశాలలోని హెలిప్యాడ్, రాజీవ్ మార్గ్, పార్క్, ఎయిర్‌పోర్ట్, కొప్పర్తి పారిశ్రామికవాడలోని అల్ డిక్సన్ టెక్నాలజీస్ పరిసర ప్రాంతాల్లో పరిశీలించారు. అనంతరం వేంపల్లె మండలంలోని ఇడుపులపాయలో వైఎస్ఆర్ ఘాట్, ముఖ్యమంత్రి నివాసం, ప్రేయర్ హాల్, ఆర్కేవ్యాలీ పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పులివెందులలో మున్సిపల్ కార్యాలయ ఆవరణంలోని ముఖ్యమంత్రి ప్రారంభించబోయే నూతన మున్సిపల్ కార్యాలయ భవనాన్ని, నగరవణాన్ని, గరండాల వంక బోటింగ్, స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ కార్యాలయ భవనాన్ని, హాకీ స్టేడియం, వైఎస్ఆర్ క్రికెట్ స్టేడియం, తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులను ఆదేశించారు. పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పాసులు ఉన్న వారిని మాత్రమే అనుమ తిస్తామన్నారు. చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. భద్రతా చర్యలపై పోలీసు అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎఆర్ ఎఎస్‌పి ఎస్.ఎస్.ఎస్.వి.కృష్ణారావు, కడప, పులివెందుల డిఎస్‌పిలు ఎం.డి షరీఫ్, వినోద్ కుమార్, ఎస్‌బి సిఐ రాజాప్రభాకర్, పాడా ఒఎస్‌డి అనిల్ కుమార్‌రెడ్డి, ఆర్‌డిఒ వెంకటేశ్వర్లు, డిఆర్‌డిఎ పీడీ యధుభూషన్‌రెడ్డి, వేంపల్లె జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి, పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి, కమిషనర్ నరసింహారెడ్డి, రెవెన్యూ, పోలీసులు అధికారులు పాల్గొన్నారు.


పులివెందుల : సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్‌పి

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని

మోకాళ్లపై నిరసన


మోకాళ్లపై నిరసన తెలుపుతున్న రిమ్స్ కార్మికులు, ఉద్యోగులు

ప్రజాశక్తి కడప అర్బన్

కాంట్రాక్టు ఉద్యోగుల మాదిరిగానే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఎపి మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, సుదర్శన్ డిమాండ్ చేశారు. గురువారం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (జిజిహెచ్) ఒపి బ్లాక్ ఎదుట నాల్గవ రోజు మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భం వారు మాట్లాడుతూ ఆప్కాస్ ఉద్యోగులకు కాంట్రాక్టు ఉద్యోగులకు ఎడ్యుకేషన్‌లో ఏమాత్రం తేడాల్లేవని, వారు పనిచేసే విధానంలో కూడా తేడాల్లేవని, వారికి ఇచ్చే వేతనాల్లో తేడాలు ఉన్నాయని పేర్కొన్నారు ప్రభుత్వం 2014, జూన్ 2 నాటికి ఐదేళ్ల సర్వీస్ పూర్తయిన అందరినీ రెగ్యులర్ చేస్తామని చెప్పిందన్నారు. ఇది సంతోషించాల్సిన విషయమని తెలిపారు. ఆ పద్ధతిలోనే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను కూడా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. పర్మినెంట్ అయ్యేంత వరకూ ఆప్కాస్ ఉద్యోగులకు పనికి తగ్గ వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్ని ఆప్కాస్ కార్మికులకు అమలు చేయాలని పేర్కొన్నారు. ఆప్కాస్‌లో పనిచేస్తున్న తల్లి దండ్రులకు వృద్ధాప్య, వికలాంగుల పెన్షన్లను ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. వాటిని వెంటనే పునరుద్ధించాలని డిమాండ్ చేశారు. ఎవరైతే ఆప్కాస్‌లో పనిచేస్తూ వికలాంగులుగా ఉన్నారో వారి పింఛన్లు కూడా రద్దు చేయడం దారుణమని చెప్పారు. అమ్మ ఒడికి సంబంధించి ఆప్కాస్ ఉద్యోగుల కన్నా కాంట్రాక్టు ఉద్యోగులే ఎక్కువ వేతనం తీసుకుంటున్నారని తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగుల పిల్లలకు మాత్రం అమ్మఒడి పడిందని, ఆప్కాస్ ఉద్యోగుల పిల్లలకు మాత్రం అమ్మఒడి పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్‌లో మాత్రం మీరు ప్రభుత్వ ఉద్యోగులని సాకు చూపిస్తూ అమ్మ ఒడి పడడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆప్కాస్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో యూనియన్ ఉపాధ్యక్షులు భాస్కర్, బాలాజీ రావు, ఏసన్న, రామకృష్ణ, చెన్నయ్య, కార్యదర్శులు కొండయ్య, సురేష్, రాజా రత్నం, కమిటీ సభ్యులు జయరాం, సుబ్బా రావు, లక్ష్మయ్య, బాదుల్లా, పవన్, మరియమ్మ, జయసుధ, రిమ్స్ కార్మికులు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం


ప్రజాశక్తి - కడప


జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న డిప్యూటీ సిఎం

జనం కోసం జీవితాన్ని అంకితం చేసిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, తొలి దళిత ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయమని ఉపముఖ్యమంత్రి ఎస్.బి అంజాద్ బాష కొనియాడారు. గురువారం బాబు జగ్జీవన్‌రామ్ 37వ వర్ధంతి సంద ర్భంగా స్థానిక నగరంలోని మహావీర్ సర్కిల్ వద్ద జగ్జీవన్ రామ్ విగ్రహానికి నగర మేయర్ కె. సురేష్ బాబుతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ బాబు దేశ ఉపప్రధానిగా, కార్మిక శాఖామంత్రి గా,వ్యవసాయ శాఖ మంత్రిగా, పార్లమెంటులో సుదీ ర్ఘంగా పనిచేసిన పార్లమెంట్ సభ్యునిగా చరిత్రలో నిలిచిన మహనీయుడన్నారు. బడుగు ,బలహీన వర్గాలు అభ్యున్నతికి కృషి చేసిన మహానేత అన్నారు. ఎన్నో ఉద్యమాలు చేసి కార్మిక చట్టాల్లో, వ్యవసాయ రంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చి బడుగు,బలహీన వర్గాలు ప్రజల కు ఆశాజ్యోతి గా నిలిచారన్నారు. **ఎఎఫ్ఎయులో.. కడప అర్బన్ :** స్వాతంత్ర్య సమర యోధుడు, జనం కోసమే తన జీవితాన్ని అంకితం చేసిన నాయకుడు బాబు జగ్జీవన్ రామ్ అని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వి సి ప్రొఫెసర్ బి.అంజనేయ ప్రసాద్ అన్నారు. గురువారం నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ లో బాబు జగ్జీవన్ రామ్ 37 వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్టర్ రాజేష్ కుమార్ రెడ్డి, నేషనల్ ఈవెంట్ కోఆర్డినేటర్ మనోహర్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లుల చెల్లింపు : ఎస్ఇ

ప్రజాశక్తి - కడప


మాట్లాడుతున్న ఎస్ఇ

విద్యుత్ బిల్లుల చెల్లింపులు డిజిటల్ రూపంలో ఆన్‌లైన్ ద్వారా సురక్షితంగా ఎక్కడి నుం డైనా చెల్లించుకునే సౌలభ్యం ఉందని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని మీరు చెల్లించిన డబ్బులకు ఆన్‌లైన్ రసీదు పొందవచ్చు అని అన్నారు. విద్యుత్ సమస్యలపై వినియోగదారులు టోల్ ఫ్రీ నెంబర్ 1912 కు లేదా సంబంధిత సిబ్బందికి కానీ ఫోన్ చేసి నిర్దిష్ట కాలవ్యవధిలో మీ విద్యుత్ సమస్యలు పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అందరికీ సంక్షేమ పథకాలు

పోరుమామిళ్ల టౌన్ : జగనన్న పాలనలో పార్టీలతో సంబంధం లేకుండా అందరికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నమని పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ సలహాదారు పి. నాగార్జున రెడ్డి అన్నారు. గురువారం పోరుమామిళ్ల సచివాలయం-2లో జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఎంపిడిఒ చంద్రమౌళి, జడ్‌పిటిసి ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపిపి సి. బాషా, వైస్ ప్రెసిడెంట్ రాళ్లపల్లి రవి, కో- ఆప్షన్ నెంబర్ అల్లా, మండల కన్వీనర్ రమణారెడ్డి, మనోజ్, వార్డు నెంబర్లు, విద్యా కమిటీ చైర్మన్ గురయ్య, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ప్రభుత్వ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. **కాశినాయన :** గ్రామాలలో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం ప్రభుత్వం ప్రవేశపెట్టిందని మండల వైసిపి కన్వీనర్ నల్లేరు విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు గురువారం మండల పరిధిలోని కొండరాజు పల్లి గ్రామపంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి సత్యనారాయణరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్యచారి, గ్రామ సర్పంచ్ శారదా దేవి, వైసిపి నాయకులు గురుబ్రహ్మం ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు

ఊర్లోని వర్షపు నీరంతా దళితవాడలోనే..

కాశినాయన : మండల కేంద్రమైన నరసాపురంలోని దళితవాడలో వర్షం వస్తే వీధుల్లో మోకాళ్ల లోతు నీళ్లు నిలబడి దళితులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి చిన్నపాటి వర్షం వచ్చినా ఊరిలోని వర్షం నీరంతా దళితవాడకు చేరుతున్నాయి. వర్షపు నీటితోపాటు ఊరిలోని చెత్తాచెదారం అంతా దళితవాడకు చేరడంతో ప్రజలను అనేక రోగాల బారిన పడుతున్నారు. దళితవాడలోని రోడ్లు అన్నీ కూడా దాదాపు 30 సంవత్సరాల కిందట నిర్మించినవే. పైగా చాలా తగ్గులో రోడ్లు ఉండడంతో ఇళ్లల్లోకి చేరుతున్నాయి. అధికారులకు సమాచారం ఇచ్చిన వారు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. గ్రామంలో రోడ్డుపైనే సిసి రోడ్లు వేస్తున్నారు. అధికారులకు దళితవాడలు పట్టావా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. అ డ్రెయినేజీ లేకపోవడంతో గ్రామంలోని వర్షపు నిరంత దళితవాడ చేరుకుంటున్నాయి. జిల్లా అధికారులు స్పందించి వర్షపు నీరు దళితవాడలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని దళితులు కోరుతున్నారు


రోడ్డుపై నిల్చిన వర్షపునీరు

హత్య కేసులో ప్రధాన కుట్రదారుడు అరెస్టు : డిఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

శ్రీనివాసులరెడ్డి హత్య కేసులో ప్రధాన కుట్ర దారుడు పాలంపల్లె సుబ్బారెడ్డి అలియాస్ రాజు సుబ్బారెడ్డిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచామని డిఎస్‌పి షరీఫ్ పేర్కొన్నారు. గురువారం డిఎస్‌పి కార్యాల యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం సాయంత్రం ఇర్కాన్ సర్కిల్ వద్ద సుబ్బారెడ్డిని అరెస్టు చేశామని తెలిపారు. హత్యకు గురైన శ్రీనివాసులరెడ్డి, సుబ్బారెడ్డి 2020 ఏడాది వరకు సన్నిహితంగా ఉంటూ వ్యాపారాలు చేసేవారని చెప్పారు. మనస్పర్థల కారణంగా విడిపోయి ఎవరి వ్యాపారం వారు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. హత్య చేసేందుకు నింది తులకు సబ్బారెడ్డి రూ.30లక్షలు ఇవ్వడంతో పాటు కోర్టు వ్యవహారాలు చూసు కుం టానని భరోసా ఇచ్చారని తెలిపారు. కేసులో ఎ-3గా ఉన్న ల్యాబ్ శ్రీనుతో హత్యకు కొన్ని రోజుల ముందు సుబ్బారెడ్డి ఇంటిలో కూర్చుని హత్యకు కుట్ర చేసినట్లు విచారణలో తేలిందన్నారు. గూగుల్ టేక్ అవుట్ ద్వారా సాంకేతిక ఆధారాలను జతప రచామని చెప్పారు. వాట్సాప్ మెసేజ్‌లను డిలీట్ చేశాడని, వాటిని రిట్రీవ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. పాలెంపల్లి సుబ్బారెడ్డిపై 12 కేసుల్లో వివిధ పోలీస్‌స్టేషన్లలో ఉన్నాయని పేర్కొన్నారు. ఇందులో రెండు హత్యాయత్నం కేసులు, ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులతో పాటు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల్లో ఉన్నాడని తెలిపారు. **అరెస్టు అక్రమం : టిడిపి..** వైసిపి శ్రీనివాసుల రెడ్డి హత్య కేసులో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పాలెం పల్లె సుబ్బారెడ్డిని పోలీసులు అరెస్టు చేయడం అక్రమమని టిడిపి మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం టిడిపి జిల్లా కార్యా లయంలో విలేకరుల సమావేశం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి నాయకులకు, పోలీసులకు మధ్య ఆర్థిక లావాదేవీలు జరిగాయి కాబట్టే హత్యతో సంబంధం లేదని సుబ్బారెడ్డిని అరెస్టు చేశారన్నారు. హత్యలో రామ్మోహన్ రెడ్డికి సంబంధం ఉందని పోలీసులకు తెలిసి ఎందుకు అరెస్టు చేయలేదన్నారు. హత్య నిందితులను కస్టడీలో ఉంచుకుని, ఏ ఆధా రాలతో సుబ్బారెడ్డిని అరెస్టు చేశారని ప్రశ్నిం చారు. అనంతరం తహ శీల్దార్ కార్యాల యంలో ఆర్ఐ సుధాకర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే అంటువ్యాధులు దూరం

- వైవీయూ ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి

ప్రజాశక్తి కడప అర్బన్

జంతువులపై అభిమానం చూపుతూ వాటి నుంచే వచ్చే వ్యాధుల పట్ల జాగ్రత్త వహించాలని యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ ఎస్.రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయం ఎన్.ఎస్.ఎస్. యూనిట్-2 ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ యస్.పి. వెంకటరమణ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయంలో ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపల్ మాట్లాడుతూ బ్యాక్టీరియల్, వైరస్ ద్వారా వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. సంక్రమిత వ్యాధులనే జూనోసిస్ డిసీజెస్ అంటారని తెలిపారు. ఎన్ఎస్ఎస్ వైవీయూ సమన్వయకర్త డాక్టర్ ఎన్. వెంకటరామి రెడ్డి మాట్లాడుతూ జంతువుల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల చుట్టూ ఉన్న సమాజాన్ని చైతన్యం చేయాలని వాలంటీర్లను కోరారు. కార్యక్రమంలో సహ ఆచార్యులు డాక్టర్ ఎ.టి.వి. రెడ్డి, డాక్టర్ అనుప్రసన్న, డాక్టర్ మరియ దాస్, ఆచార్య ఎల్.వి. రెడ్డి, డాక్టర్ టి. చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు ఉచిత టీకాలు

ప్రపంచ జొనోసిస్ దినోత్సవం సందర్భంగా వెటర్నరీ పాలీక్లినిక్‌లో జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ శారదమ్మ అధ్యక్షతన గురువారం పెంపుడు జంతువులకు ఉచితంగా రేబీస్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువుల ద్వారా సంక్రమించే వ్యాధుల గురించి అవగాహన కోసం ప్రతీ సంవత్సరం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పశువుల నుంచి రేబీస్, ఆంత్రాక్స్, టి.బి, ప్లేగు, సార్స్, ఎబోలా, తామర, నులి పురుగులు వంటి వ్యాధులు సంక్రమిస్తాయని చెప్పారు. జంతువులకు ఆకస్మికంగా జబ్బులు వచ్చినప్పుడు సమీప పశు వైద్యశాలలో వైద్యుడికి తెలపాలని కోరారు. కార్యక్రమంలో ఎడిడిఎల్ ఎడి డాక్టర్ రాజశేఖర్, డాక్టర్లు రాంబాబు, సంధ్య, జెవిఒ రాజశేఖర్, ఎల్ఎస్ఎ షాహిదాబేగం, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కలసపాడు : మండలంలో ఉన్న పెంపుడు కుక్కలకు రాబిస్ వ్యాధి రాకుండా పశు సంవర్ధశాఖ వైద్యశాలలో ఉచితంగా టీకాలు వేస్తున్నట్లు పశువైద్యాధికారి ఎ. వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంపుడు కుక్కలు, పిల్లులు నుంచి రాబిస్ వ్యాధి రాకుండా ఉచితంగా టీకాలు వేయించుకోవాలన్నారు. ఈ వ్యాధి ఒకసారి వస్తే చికిత్స ఉండదని తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో 12 మంది డీబార్

కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ పరీక్షల్లో 12 మంది విద్యార్థులు డీబారయ్యారు. పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్. ఈశ్వర్ రెడ్డి పెండ్లిమర్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నలుగురిని స్వయంగా డీబార్ చేశారు. స్క్వాడ్ సభ్యులు ఆచార్య విజయ రాఘవ ప్రసాద్, ఎన్‌సి గంగిరెడ్డి, ఆచార్య ఎం.వి. శంకర్, ఆచార్య చంద్ర ఓబులరెడ్డి, వీరబల్లి రాయచోటి సుండుపల్లె కేంద్రాలలో తనిఖీ చేసి ఏడుగురికి విద్యార్థులను డీబార్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని కేంద్రాలలో స్క్వాడ్ సభ్యులు తనిఖీలు నిర్వహిస్తున్నారని తెలిపారు.

9న సీనియర్ మహిళా క్రికెట్ జట్ల ఎంపికలు

కడప : ఈనెల 9న కడపలోని వైయస్ రాజారెడ్డిఎసిఎ స్టేడియంలోని క్రికెట్ నెట్స్‌లో అండర్ -15, అండర్ -19, సీనియర్స్ మహిళ జిల్లా క్రికెట్ జట్ల ఎంపికలు ఉదయం ఎనిమిది గంటలకు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఏ. రెడ్డి ప్రసాద్, డిసిఒఎస్. కాజా మైనుద్దీన్, ఉమెన్ కోఆర్డినేటర్ కె. విష్ణు మోహన్ రావు తెలి పారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఎంపికలకు హాజరుకావాలని సూ చించారు.అండర్-15 మహిళా క్రికెట్ జట్టు ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 2009 సెప్టెంబర్ 1వ తేదీ తరువాత జన్మించి ఉండాలని తెలిపారు. అండర్-19 మహిళా జట్టు ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 2004 సెప్టెంబర్ 1న తరువాత జన్మించి ఉండాలని తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే మహిళా క్రీడాకారులు వారి యొక్క బర్త్,ఆధార్, స్టడీ సర్టిఫికెట్లు తీసుకురావాలన్నారు.

యుఎఇ వైఎస్ఆర్‌సిపి కన్వీనర్‌గా సయ్యద్ అక్రమ్

ప్రజాశక్తి - కడప



యుఎఇ (దుబాయ్) వైసిపి కన్వీనర్‌గా కడప పట్టణానికి చెందిన అక్రమ్ నియమితులయ్యారు. అక్రమ్ 12 ఏళ్లుగా దుబాయిలో ఒక ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. రెండేళ్ల కిందట గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్ దుబాయ్ వెళ్లినప్పుడు దుబాయ్ మాజీ కన్వీనర్ ప్రస్తుత వైసిపి యుఎఇ అడ్వయిజరీ కమిటీ సభ్యులు సోమిరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డితో కలిసి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్రమ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో యుఎఇ కన్వీనర్‌గా నియమించిన అందరికీ తజ్ఞతలు తెలిపారు. పార్టీ అధిష్టానం తన ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయ కుండా అను నిత్యం పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు.

ఉచితంగా పాఠ్యపుస్తకాలు పంపిణీ

చెన్నూరు : స్థానిక బాలికల హైస్కూల్‌లో గురువారం ఎంఇఒ గంగిరెడ్డి, హెచ్ఎం రత్నాదేవి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ హై స్కూల్ ప్లస్ విద్యార్థినులకు తన పూర్తి సహకారం అందిస్తామని అన్నారు.

ఇన్‌ఛార్జ్ పిఎస్‌గా కిరణ్

కడప అర్బన్ : కడప పోస్టల్ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్‌గా బద్వేల్ ప్రాంత నివాసి కిరణ్ గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఆయన ప్రొద్దుటూరు పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ గా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప డివిజన్ పోస్టల్ ఖాతాదారులకు మంచి సేవలు తమ సిబ్బంది ద్వారా అందిస్తామని చెప్పారు.

పేర్లు నమోదు చేసుకోవాలి

కడప : ఆంధ్రప్రదేశ్ ఫుట్ బాల్ సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో లైసెన్సు కలిగిన రెఫరీలు, కోచ్‌లు, అన్ని వయస్సుల విభాగాల ఫుట్ బాల్ క్రీడాకారులు విధిగా ఆంధ్ర ప్రదేశ్ ఫుట్ బాల్ అసోసియేషన్ లో పేర్లు నమోదు చేసుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ ఫుట్ బాల్ అసోసియేషన్ వైయస్సార్ కడప జిల్లా కార్యదర్శి మామిడి సుధీర్ ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో అండర్ -14, 17 విభాగాల్లో జిల్లాస్థాయి పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పేర్లు నమోదు కోసం 9912020424, 9959006388లలో సంప్రదించాలన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కడప అర్బన్ : ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష, నగర మేయర్ కే సురేష్ బాబు సంయుక్తంగా పేర్కొన్నారు. స్థానిక దేవుని కడప రోడ్డులో రోడ్డు భవనాల శాఖ ఆధ్వర్యంలో కృష్ణ సర్కిల్ నుంచి దేవుని కడప రోడ్డు ట్యాంక్ వరకు 1.45 కి.మీ రోడ్డు విస్తరణ, సీసీ రోడ్డు, ఆధునికీకరణకు రూ.65 కోట్ల అంచనతో నిర్మించబోయే పనులకు గురువారం ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, మేయర్ సురేష్‌బాబు శంకుస్థాపన చేశారు. ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో కడప నగరాన్ని అతి సుంద రంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీని యర్ నాయకులు అఫ్జల్ ఖాన్ ఖాన్, కార్పొరేటర్లు, ఆర్అండ్‌బి ఇఇ ప్రభాకర్ నాయుడు, డిఇ షాషావలి, ఎఇ గంగిరెడ్డి పాల్గొన్నారు.

ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించాలి

కడప అర్బన్ : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈనెల 10న కడపకు వస్తున్న నేపథ్యంలో ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఫిజికల్ ఈవెంట్స్ ఎప్పుడు నిర్వహిస్తారో ప్రకటించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) నగర కార్యదర్శి డి.ఎం. ఓబులేసు డిమాండ్ చేశారు. గురువారం పాత బస్టాండ్‌లోని డివైఎఫ్ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది ఆంధ్రప్రదేశ్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ ద్వారా 6,100 కానిస్టేబుల్ 411 ఎస్ఐపోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారని పేర్కొన్నారు. వాస్తవానికి మార్చి 14న ఈవెంట్స్ నిర్వహించాల్సి ఉండగా అప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికలు ఉండటంతో వాయిదా వేశారన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు నిర్వహించాలన్నారు. సమావేశంలో డివైఎఫ్ఐ నగర అధ్యక్షులు ఎస్. షాకీర్ నగర ఉపాధ్యక్షులు విజయ్, ఉదయ్, బాష పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు ఇవ్వకపోవడం దారుణం

పోరుమామిళ్ల టౌన్ : జూనియర్ కళాశాలలు తెరచి నెల రోజులు గడుస్తున్న ఇంతవరకూ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వకపోవడం దారుణమని ఎస్ఎఫ్ఐ నాయకులు పేర్కొన్నారు. గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వీరపోగు రవి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు పేదలు కావడంతో పుస్తకాలు కొనలేని పరిస్థితిలో ఉన్నారని చెప్పారు. దీనిని ప్రభుత్వం దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందించాలన్నారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని అన్నారు. అనంతరం ఆర్ఐ సుధాకర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రాహుల్, మండల నాయకులు సుమంత్, సందీప్, ప్రవీణ్, చందు, విద్యార్థులు పాల్గొన్నారు.




నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు

సమస్యల పరిష్కారానికి కృషి

- ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ప్రజా సమస్యల పరిష్కారానికి వాలంటీర్లు కృషి చేయాలని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సూచించారు. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజల వద్దకే పాలన తీసు కొచ్చారన్నారు. అందుకు అనుగుణంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నామన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ కోరారు. వచ్చే ఎన్నికల్లో కూడా వైసిపికి పట్టం కట్టాలని ప్రజలు, కార్యకర్తలను కోరారు. ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పోరాడి వైసిపికి ఓట్లు వేయించేందుకు కృషి చేయాలన్నారు. జిల్లాలోని నలుమూలల నుంచి ప్రజలు వైసిపి, కార్యకర్తలు, నాయకులు వారి సమస్యలను విన్నవించారు. అనంతరం అక్కడే బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

బాధితులకు సత్వర న్యాయం

ప్రజాశక్తి - ఖాజీపేట

పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వరమే న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డి సూచించారు. ఖాజీపేట ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన రాజ రాజేశ్వరరెడ్డి గురువారం ప్రొద్దుటూరులోని తన నివాసంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.



ఎమ్మెల్యేను కలిసిన ఎస్ఐ రాజరాజేశ్వరరెడ్డి

జగ్జీవన్‌రామ్ గాంధేయవాది

ప్రజాశక్తి - వేంపల్లె

బాబు జగ్జీవన్‌రామ్ స్వాతంత్ర్య సమర యోధుడు, గాంధేయవాది, సమతావాదని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, అమర్, రామకృష్ణ, నరసింహారెడ్డి, బద్రి, శివారెడ్డి, రాఘవయ్య, బాలం సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఈవెంట్స్‌ను తక్షణమే నిర్వహించాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఈవెంట్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నిర్వహించాలని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్ రాజ్ డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాలుగు నెలలు గడిచినా ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఈవెంట్స్ నిర్వహించలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఖాళీ పోస్టుల భర్తీకి ముఖ్యంగా డిఎస్‌సి గ్రూప్-2 సచివాలయ పోస్టులకు తక్షణమే నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.36 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తానని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండా నిరుద్యోగులను తీవ్రమైన నిరాశకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈవెంట్స్ నిర్వహించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు దిగవలసి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు పవన్, ఉదయ్ పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఈవెంట్స్ నిర్వహించాలని డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఎన్జీఓ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాలుగు నెలలు గడిచినా ఇప్పటిదాకా ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఈవెంట్స్ నిర్వహించకుండా రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు. సమావేశంలో నాయకులు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా మురళీకృష్ణ నియామకం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల నగర పంచాయతీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా మురళీకృష్ణ డిప్యూటేషన్‌పై గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన జమ్మలమడుగు నగర పంచాయతీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా ఉంటూ వచ్చారు. మురళీకృష్ణను రీజినల్ డైరెక్టర్ ఆఫ్ టౌన్ ప్లానింగ్ అధికారులు డిప్యూటేషన్ మీద నియమించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, కమిషనర్ పగడాల జగన్నాథ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

ఎర్రమట్టిని తొలగించాలని వినతి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఆటో స్టాండ్‌లో ఉన్న ఎర్రమట్టిని తొలగించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆ ప్రాంతంలో అధికారులు ఎర్రమట్టి వేయడంతో ఆటో కార్మికులకు ఆటోలు నిలుపుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆ మేరకు గురువారం సిపిఎం జమ్మలమడుగు కార్యదర్శి వీరనాల శివనారాయణ ఆర్‌డిఒ కార్యాలయ పరిపాలనాధికారి ఇగ్బాల్ బాషాకు వినతిపత్రం ఇచ్చారు. సమస్యపై గతంలో తహశీల్దార్‌కు కూడా వినతిపత్రం ఇచ్చామని, ఎలాంటి స్పందనా లేదని శివనారాయణ తెలిపారు. మీరైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ పట్టణ అద్యక్షులు ఆదాము, శామ్యూల్, సుద్దపల్లి పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

మహిళల ఉపాధికి ఆసరా.. ఆదిత్య గార్మెంట్స్

13 ఎకరాల్లో నిర్మాణ పనులు - 2 వేల మందికి ఉపాధి - ప్రస్తుతం 400 మందితో దుస్తుల తయారీ



టైలరింగ్ చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందులలో పలు పరిశ్రమల ద్వారా ఉపాధి కల్పన, ఆర్థిక స్వావలంబన తీసుకొచ్చే క్రమంలో భాగంగా.. ప్రతి మహిళా ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వ పరంగా వారికి పథకాలు అందిస్తున్నారు. మరో వైపు పరిశ్రమలు ఏర్పాటు చేయించి, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. తద్వారా సొంత కాళ్లపై నిలబడి, కుటుంబాన్ని పోషించుకునేలా తీర్చిదిద్దుతున్నారు. ఈ క్రమంలో పులివెందుల పట్టణ శివారులో 13 ఎకరాల్లో సుమారు రూ.170 కోట్లతో ఆదిత్య బిర్లా గార్మెంట్స్ పరిశ్రమ ఏర్పాటుకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి ఈ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. కంపెనీ మహిళలకు ఇంటర్వ్యూలు నిర్వహించి, ఎపి కార్ల్‌లో శిక్షణనిస్తున్నారు. శిక్షణ పూర్తి చేసిన ప్రస్తుతం 400 మంది మహిళలతో దుస్తులు తయారీకి శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది ఈ ఏడాది డిసెంబర్ నాటికి పరిశ్రమ పూర్తి చేసి 2 వేల మంది మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. శిక్షణలో కూడా వారికి రూ.6 వేల నుంచి రూ.8 వేల వరకు వేతనాలు ఇస్తారు. ప్రస్తుతం మహిళలు ప్యాంట్లు, సూట్ తయారీలో నిమగ్నమై ఉన్నారు. పులివెందుల నియోజక వర్గంలోనే కాక కడప, ధర్మవరం, అనంతపురం ప్రాంతాల నుంచి వచ్చి పని చేస్తున్నారు. వారికి సమీప ప్రాంతాల నుంచి బస్సు, ఆటో సౌకర్యం కల్పించారు. ఆసక్తిగల వారు శిక్షణ పొంది ఉద్యోగ అవకాశాలు పొందవచ్చు.

కుటుంబానికి ఆర్థిక చేయూత : మహిళలు

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదిత్య బిర్లా గార్మెంట్స్ పరిశ్రమ పులివెందులకు తీసుకురావడంతో గార్మెంట్స్‌లో ఉపాధి కోసం అందులో చేరి, శిక్షణ పొందుతున్నాం. శిక్షణ సమయంలో కూడా జీతం ఇస్తున్నారు. కుటుంబానికి ఎంతో ఆర్థిక చేయూత లభిస్తోంది.




నిరుద్యోగులకు వరం : మేరీ, ఉద్యోగి

పులివెందులలో ఆదిత్య బిర్లా పరిశ్రమ ఏర్పాటు చేయడం నిరుద్యోగ మహిళలకు వరం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదిత్య బిర్లా పరి శ్రమను ఇక్కడ ఏర్పాటు చేయించడం చాలా ఆనందంగా ఉంది.

అదనపు ఛార్జీలు తక్షణం రద్దు చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర ప్రజలపై పెనుభారం కానున్న విద్యుత్ ట్రూఆప్ ఛార్జీలు, సర్ ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలతోపాటు అదనపు ఛార్జీలు తక్షణం రద్దు చేయాలని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద అఖిలపక్షం ఆధ్వర్యంలో గురువారం విద్యుత్ అదనపు ఛార్జీలకు నిరసనగా సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమాన్ని తులసిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యుత్ ప్రయివేటీకరణలో భాగమైన వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించే విధానం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలకు తిలోదకాలిచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ ప్రయివేటీకరణ బిల్లుకు మద్దతు ఇచ్చి షరతులను శరవేగంగా అమలు చేయడం శోచనీయమన్నారు. విద్యుత్ సంస్థలను అప్పుల ఊబిలోకి నెట్టి కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టాలని చూడడం దారుణమన్నారు. టిడిపి నాయకులు గొటూరు నాగ భూషణం, మహమ్మద్ ఇనాయతుల్లా, మహబూబ్ షరీఫ్, ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లా, జిల్లా ఉపాధ్యక్షుడు దాదాపీర్, సిపిఐ ఏరియా కార్యదర్శి వెంకటరాములు, కొత్తకాల్వ బ్రహ్మం, కాంగ్రెస్ పార్టీ నాయ కులు ఉత్తన్న, నరసింహారెడ్డి, సుబ్రమణ్యం, సిపిఐ నాయకుడు ఎస్. బాషా, జగ్గరయ్య, అంజనప్ప, ఆమ్‌ఆద్మీ పార్టీ మండల నాయకులు గౌస్ బాషా, మడక శ్రీనివాసులు, రైతు కూలీ సంఘం నాయకులు రవికుమార్ పాల్గొన్నారు.



సంతకాల సేకరణను ప్రారంభిస్తున్న తులసిరెడ్డి

పలువురు వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలకు ఆకర్షితులై టిడిపి నుంచి వైసిపిలోకి దాదాపు 100 కుటుంబాలు బలిజ సంఘం నాయకులు కడియాల లక్ష్మీనారాయణ, తుమ్మలపల్లె విశ్వనాథరెడ్డి, శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో చేరాయి. పులివెందుల ద్వారకా నగర్ కాలనీకి చెందిన మారుతి మోహన్‌రెడ్డి, అర్జున్‌రెడ్డి, రామ కృష్ణారెడ్డి, అశోక్ రెడ్డి, రామలక్ష్మణ్‌రెడ్డితోపాటు వంద కుటుంబాలు గురువారం ఎంపీ అవినాష్‌రెడ్డి, వైయస్ మనోహర్‌రెడ్డి సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ, మనోహర్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి వైసిపిలోకి ఆహ్వానించారు. అనంతరం పార్టీలో చేరిన వారు ఎంపీ అవినాష్‌రెడ్డికి కృష్ణుడి చిత్రపటాన్ని అందజేశారు. మారుతి మోహన్‌రెడ్డి, అర్జున్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ చేస్తున్న అభివృద్ధి చూసి పార్టీలో చేరామన్నారు. తమపై నమ్మకంతో కడియాల లక్ష్మీనారాయణ, విశ్వనాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి వైసిపిలో చేర్పించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ చిన్నప్ప, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, కోడి రమణ, పద్మనాభరెడ్డి, వీరారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎంపీకి జ్ఞాపికను అందిస్తున్న మారుతి మోహన్‌రెడ్డి

పోలీసులు నిజాలు నిగ్గుతేల్చాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

వారం రోజుల క్రితం టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ప్రొద్దుటూరులో జరుగబోవు హత్యల విషయమై చేసిన పత్రికా ప్రకటనపై నిజానిజాలను పోలీసులు నిగ్గుతేల్చాలని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రవీణ్ ప్రకటన వల్ల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. దీనిపై పోలీసులు విచారణ వేగవంతం చేయాలన్నారు. కడపలో రెండుసార్లు పత్రికా సమావేశంలో ప్రవీణ్ పొంతనలేని ప్రకటన చేసినట్లు తెలిపారు. శాంతియుతంగా ఉన్న ప్రొద్దుటూరు అలజడికి గురవుతోందన్నారు. పోలీసులు వెంటనే విచారించి, వాస్తవాలతో ప్రకటన చేయాలని ఎస్‌పి, ప్రొద్దుటూరు ఎఎస్‌పిని కోరు తున్నామన్నారు. లేనిపక్షంలో పోలీసుల నిర్లక్ష్యానికి నిరసనగా దీక్ష చేపట్టాల్సి ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, కౌన్సిలర్‌లు వరికూటి ఓబులరెడ్డి, కమాల్‌బాషా, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సర్వీస్ రూల్స్ వెంటనే విడుదల చేయాలి

ప్రొద్దుటూరు : రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్‌ను వంటనే విడుదల చేయాలని రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు యాదవ్ డిమాండ్ చేశారు. స్థానిక ఎస్టీఎఫ్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన ముఖ్యనాయకులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్, కారొరేషన్, గ్రేటర్ కార్పొరేషన్ అన్ని చట్టాల్లో ఉద్యోగులకు సర్వీస్ రూల్స్ విడుదల చేసే అధికారం ప్రభుత్వానిదే అన్నారు. 1975 ప్రెసిడెన్సియల్ ఆర్డర్ ప్రకారం మున్సిపల్ ఎడ్యుకేషనల్ యూనిఫైడ్ సర్వీస్ రూల్స్ విడుదల చేయాలని, తద్వారా మున్సిపల్ పాఠశాలలో పెరిగిన విద్యార్థుల సంఖ్యకనుగుణంగా ఉపాధ్యాయుల సంఖ్య కూడా పెరుగుతుం దన్నారు. ఇలా మున్సిపల్ విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ గౌరవాధ్యక్షుడు హరిరామకృష్ణ, అధ్యక్షుడు వినోద్‌కుమార్, నాయకులు లక్ష్మీచౌదయ్య, నాగేంద్ర పాల్గొన్నారు.

డిప్లొమా ఫలితాల్లో సిబిఐటి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - చాపాడు

స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ విడుదల చేసిన డిప్లొమా మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరం సెమిష్టర్ పరీక్షా ఫలితాల్లో సిబిఐటి విద్యార్థులు ప్రతిభ కనబరచి ఉత్తమ ఫలితాలు సాధించారు. రెండవ సంవత్సరం ఈసిఈ విభాగానికి చెందిన కె.దస్తగిరి-96.7శాతం, యం. జయంతి-95.3 శాతం, యం. మౌనిక-94 శాతం, ఈఈఈ విభాగానికి చెందిన యం.రెడ్డి శశాంక్ రెడ్డి -91.9 శాతం మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం విద్యార్థులలో ఈసిఈ విభాగానికి చెందిన యస్.లక్ష్మి సాయిచరణ్-93.8 శాతం, ఐ.శ్రావణ్‌కుమార్ రెడ్డి-92.1 శాతం, వి.జ్యోత్స్న-90.5 శాతం, ఈఈఈ విభాగానికి చెందిన జి.మేరీ-90.2 శాతం, సి.యం.ఈ. విభాగానికి చెందిన టి. ముబారక్-86.5 శాతం మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించడంపై కరెస్పాండంట్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసుల రెడ్డి, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

ఆధారాలు సమర్పించండి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - కొండాపురం

గండికోట ప్రాజెక్టులో మొదటి విడతగా ముంపునకు గురైన 14 గ్రామాల ప్రజలు ఆధారాలు సమర్పించాలని ఆర్‌డిఒ శ్రీనివాసులు తెలిపారు. గతంలో ఆరు లక్షల 75 వేల రూపాయలు తీసుకున్నవారు సిఎం ప్రకటించిన అదనపు పరిహారం మూడు లక్షల 25 వేల రూపాయల కోసం తమకు సంబంధించిన ఆధారాలు సమర్పించాలన్నారు. ఆధార్, ఓటర్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ వంటి నివాస ధ్రువీకరణ పత్రాలతోపాటు 2004-2007 మధ్యలో మేజర్లయిన వారు వయసు నిర్ధారణ కోసం టెన్త్ క్లాస్ మార్క్స్ సర్టిఫికేట్ లేక బర్త్ సర్టిఫికెట్లను తప్పనిసరిగా కొండాపురం తహశీల్దార్ కార్యాలయంలో ఆయా గ్రామ పరిపాలన అధికారులకు అందజేయాలని ఆర్‌డిఒ తెలిపారు.

జీవనోపాధికి డ్రైవింగ్ శిక్షణ నేర్చుకోవాలి


ప్రజాశక్తి- వేంపల్లె

జీవనోపాధి కోసం డ్రైవింగ్ నేర్చుకోవాలని సిఐ వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం సాయంత్రం స్థానిక కాలేజి రోడ్డులో ఉన్న దివ్యారామం ఆవరణలో బిఎన్ఆర్ డ్రైవింగ్ స్కూల్ ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత డ్రైవింగ్ శిక్షణను సిఐ ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ నేర్చుకొనే సమయంలో ట్రాఫిక్ నిబంధనలను కూడా తెలుసుకోవాలని సూచించారు. కవి డాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ సహకారంతో డ్రైవింగ్ నేర్చుకొనే వారికి టి షర్టులు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. రిటైర్డ్ ప్రిన్సిపల్ నర్సింహులు, కవి డాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ కరస్పాండెంట్ వరప్రసాద్‌రావు, రియల్ ఎస్టేట్ రాము, వార్డెన్ మాణిక్యరావు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెంపుడు జంతువులపై అవగాహన

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పెంపుడు జంతువులపై వాటి యజమానులకు అధి కారులు అవగాహన కల్పిం చారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా గురువారం ఏరియా పశువైద్యశాలలో జూనోటిక్ వ్యాధులపై ప్రజలకు అవ గాహన సదస్సు నిర్వహించినట్లు జమ్మలమడుగు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యఅతిథులుగా అర్బన్ సిఐ సదాశివయ్య, క్యాంబెల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ అగస్టిన్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాదాపు 60 పెంపుడు జీవాలకు టీకాలు అందించామని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ జాన్ సుధాకర్‌బాబు, డాక్టర్ రాఘవేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.



కుక్కలకు టీకా వేస్తున్న పశు వైద్యాధికారులు

పైపులైన్ సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ఉన్న మంచి నీటి పైపులైన్లను సరిచేయాలని సిఐటియు నాయకులు దాసరి విజయ్ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహం వద్ద ఉన్న మంచి నీటి పైప్‌లైన్ లీక్ కావడంతో నీరంతా వృథాగా పోతోందన్నారు. ఇప్పటికే ఈ నీటి సమస్యతో ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వెంటనే సమస్య పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను కోరారు. కార్యక్రమంలో సిఐటియు ఆటో యూనియన్ స్టాండ్ కార్యదర్శులు నరేంద్ర, దస్తగిరి, మునిస్వామి, సుబ్బన్న, హాజీ, రాజు, దివాకర్ పాల్గొన్నారు.



సమస్యను పరిష్కరించాలంటున్న సిఐటియు నాయకులు

క్రైం కార్నర్

దొంగ అరెస్టు

ప్రజాశక్తి - చక్రాయపేట

చక్రాయపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గంగారపువాండ్లపల్లిలోని చింతల గంగమ్మ గుడిలో దొంగతనం చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. గుడిలో జూన్ 20న రాత్రి హుండీలోని డబ్బును దోచుకెళ్లారని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పులివెందుల డిఎస్‌పి వినోద్‌కుమార్ అదేశాల మేరకు ఆర్‌కె వ్యాలీ సిఐ గోవిందరెడ్డి నేతృత్వంలో ఎస్ఐ వినోద్‌కుమార్, సిబ్బంది గండిక్షేత్రం బస్టాప్ వద్ద సత్యసాయి జిల్లా తలపుల మండలం మామిళ్ళవారిపల్లికు చెందిన ఎల్లూరు కరుణాకర్‌రెడ్డిని గురువారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. అతని వద్ద నుండి సదరు కేసుకు సంబంధించిన రూ.5,250 నగదు, ఆ డబ్బుతో కొన్న సెల్‌ఫోన్, మెమోరీ కార్డ్‌లను స్వాధీనం చేసుకున్నారు. దొంగను అరెస్టు చేసిన ఎస్ఐని, కానిస్టేబుల్ శ్రీనివాసులు, హోంగార్డులు రవి, నాగరాజు, కానిస్టేబుళ్ళు నరసింహులు, ఖాదర్ వల్లి, జిలానిబాషాను పులివెందుల డిఎస్‌పి అభినందించారు.

హత్య కేసులో లొంగిపోయిన నిందితుడు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఆర్‌టిపిపిలో బుధవారం మృతి చెందిన భాస్కర్‌రెడ్డి (33)ది హత్యగా పోలీసులు నిర్ధారించారు. పోలీసు తెలిపిన వివరాల మేరకు.. రేణుకారెడ్డి అనే వ్యక్తి 20ఏళ్లుగా పర్మినెంట్ ఉద్యోగిగా ఆర్‌టిపిపిలో విధులు నిర్వహిస్తున్నాడు. రేణుకారెడ్డికి, భాస్కర్‌రెడ్డికి మూడు రోజుల కిందట ఉద్యోగ విషయంలో గొడవ జరిగినట్లు తెలిపారు. దీన్ని మనసులో ఉంచుకొని క్షణికావేశంలో బుధ వారం సాయంత్రం రాడ్డుతో భాస్కర్‌రెడ్డి తలపై గట్టిగా కొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలంలో పోలీసులు విచారించే క్రమంలో రేణుకారెడ్డి తనే హత్య చేసినట్లు ఒప్పుకున్నాడని పోలీసులు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని రిమాండ్ పంపినట్లు ఎస్ఐ సంజీవరెడ్డి తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కాశినాయన

మండలంలోని వరికుంట్ల జ్యోతి క్షేత్రం ప్రధాన రహదారిలో ఎస్‌టి కాలనీకి పోయే దారి సమీపంలో 65 ఏళ్ల గుర్తుతెలియని మృతదేహం లభించినట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఆచూకీ తెలిసినవారు పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మందులు వాడాలి

ప్రొద్దుటూరు : కుష్టు వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడాలని డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ శివ శంకరయ్య, డాక్టర్ సునీల్ కుమార్ తెలిపారు. డ్రైవర్ కొట్టాలలో 15 మంది అనుమానితులను గురువారం పరీక్షించారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కామనూరు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ హనీఫ్ బాబా సూచించారు. చౌడూరు గ్రామంలో గురు వారం డెంగీ నివారణ మాసోత్సవంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. వర్షాకాలంలో దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన చర్యలు జాగ్రత్తలపై అందరికీ బాధ్యత ఉందన్నారు. కార్యకార్యక్రమంలో సూపర్ వైజర్ బిఎ వరప్రసాద్, ఎఫ్‌పిసి పర్యవేక్షకడు చంద్ర శేఖర్, సిహెచ్ఒ నాగలత, ఆరోగ్య కార్యకర్త వేదవతి, ఆశా కార్యకర్తలు పద్మావతి, సంజమ్మ, వెంకట సుబ్బమ్మ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ఎపి మదర్ థెరిస్సా విభిన్నప్రతిభావంతుల సేవా సమితి ఆధ్వర్యంలో జిమ్ ఇకో సర్వీసెస్ ఎల్ఎల్‌పి సహకారంతో లక్ష్మి పావని డైరెక్టర్ నిరుపేద విభిన్నప్రతిభావంత విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పలకలు, పెన్నులు, చాపలు, రంగు పెన్సిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వికాస్ విహార్ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయురాలు ఝాన్సీరాణి, లక్ష్మి పావని, రాష్ట్ర అధ్యక్షుడు షాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.